AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
4-3-2026 (Wednesday) MAIN EDITION

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ ఖమేనీ రెండో కుమారుడు మొజ్తాబా ఖమేనీ (56) ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ దేశ మీడియా వెల్లడించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. 36 ఏళ్లు దేశాన్ని పాలించిన ఖమేనీ ఫిబ్రవరి 28న చనిపోయారు. ఆయన కుమార్తె, అల్లుడు, మనవరాలు మరణించారు. ఖమేనీ భార్య మన్సౌరే ఖోజాస్తే బగెర్జాదే కూడా దాడుల సమయంలో తగిలిన గాయాలతో మరణించారు. దీంతో అయతుల్లా అలిరేజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ముగ్గు రు సభ్యుల ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి తదుపరి వారసుడిని ఎన్నుకుంది.

## వరుసగా రెండో రోజు తగ్గిన బంగారం ధర



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశీయ బంగారం మార్కెట్‌లో వరుసగా రెండో రోజు గోల్డ్ రేట్లు తగ్గాయి. బంగారం ధరలు ఇటీవల రికార్డు స్థాయిలను తాకిన నేపథ్యంలో ఈ తగ్గుదల వినియోగదారులకు కొంత ఊరటనిచ్చింది. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల సీజన్‌లో కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయం కావచ్చని వ్యాపారులు చెబుతున్నారు. దేశంలో బుధవారం 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,67,610గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,53,640కు చేరింది.

## 83 డాలర్లకు క్రూడ్ ఆయిల్ ధర



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను కుదిపేస్తోంది. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. తాజా గణాంకాల ప్రకారం.. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 82.66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క వారంలోనే ఏకంగా 12శాతం పెరగడం గమనార్హం.

## టీపీసీసీ చీఫ్ ఢిల్లీ పర్యటన వాయిదా



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో రాజ్యసభ అభ్యర్థులపై సస్పెన్స్ కొనసాగుతోంది. అభ్యర్థుల ఎంపిక కోసం ఢిల్లీ వెళ్లాల్సిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పర్యటన వాయిదా పడింది. తెలంగాణలో 2 రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక కోసం అధిష్టానంతో చర్చించేందుకు ఈ రోజు మధ్యాహ్నం ఆయన ఢిల్లీకి వెళ్లాల్సి ఉండగా క్యాన్సిల్ అయింది.

## తిరుమలలో చిరుత కలకలం



**అక్షరటుడే, తిరుమల:** తిరుమలలో మరోసారి చిరుతపులి కలకలం రేపింది. అలిపిరి టోల్ గేటుకు సమీపంలో చిరుత సంచరించినట్లు అనుమానం వ్యక్తం అవుతున్నాయి. ఈ ఉదయం జింకపై చిరుత దాడి చేసి చంపేసింది. చిరుత సంచారంతో టీటీడీ విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు.



## ఇరాన్ అణు కేంద్రం ధ్వంసం..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. రెండు దేశాలు పరసర్పం దాడులు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌లోని అణు కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. దాడిని ఐడీఎఫ్ దళాలు ప్రకటించాయి. టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదెహైలో న్యూక్లియర్ కేంద్రం కాంపౌండ్‌పై దాడి చేసినట్లు పేర్కొన్నాయి. ఈ కేంద్రంలో శాస్త్రవేత్తలు రహస్యంగా పని చేస్తున్నట్లు సమాచారం. 2025లో అమెరికా ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసింది. దీంతో ఇరాన్ రహస్య ప్రాంతంలోకి అణు స్థావరాన్ని మార్చినట్లు సమాచారం. తాజాగా వాటిని రహస్య ప్రాంతంలో దాచినట్లు ఖచ్చితమైన సమాచారం రావడంతో దాడులు చేశామని తెలిపింది. యుద్ధం మొదలైన నాటి నుంచి ఇరాన్‌కు చెందిన 300 క్షిపణి లాంచర్లపై తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది.

## ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష




**అక్షరటుడే, హైదరాబాద్:** ములుగు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి ఇవాళ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే రెండేళ్లలో ఎట్టి పరిస్థితుల్లో వీటిని ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. అవసరమైన నిధులు సత్వరం విడుదల చేస్తామన్నారు.

**హైదరాబాద్ నగరంలో మరోసారి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాచుపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఫర్నిచర్ షాపులో మంటలు చెలరేగాయి. అనంతరం ఫుట్‌పాత్‌పై ఉన్న షాపుల్లోకి వ్యాపించాయి. దీంతో 50 షాపులు దగ్ధం అయ్యాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఘటనలో రూ.5 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగింది.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- బాచుపల్లిలో కాలిబూడిదైన ఫర్నిచర్ దుకాణాలు
- రూ.5 కోట్లకుపైగా ఆస్తినష్టం



# భారీ అగ్ని ప్రమాదం

బాచుపల్లిలోని ప్రగతినగర్‌లో వరుసగా ఫర్నీచర్ షాపులు ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో కేజీఆర్ కన్వెన్షన్‌ను ఆనుకోని ఉన్న ఫర్నిచర్ దుకాణంలో మొదట మంటలు చెలరేగాయి. అనంతరం నిమిషాల వ్యవధిలోనే మిగతా షాపులకు వ్యాపించాయి. అన్ని ఫర్నిచర్ షాపులే కావడంతో మంటలు త్వరగా అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున పొగ అలుముకుంది. భారీ ఎత్తున మంటలు ఎగిసి పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

### 10 ఫైరింజన్‌లతో..

అగ్ని ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పది ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో దాదాపుగా రూ.5 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. దాదాపు 5 గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలు తెలియరాలేదు.

### మానవత్వం చాటిన యువత

బాచుపల్లి అగ్నిప్రమాద ఘటనలో పలువురు యువకులు మానవత్వం చాటుకున్నారు. వరుసగా ఫర్నిచర్ దుకా ణాలు ఉండడం, మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో ఫర్నిచర్ తరలించారు. బాధితుల కష్టాన్ని చూసి మాన వతా దృక్పథంతో ఫర్నిచర్ తరలింపునకు స్థానికులు, యువత ముందుకు వచ్చారు. సోఫా సెట్లు, కుర్చీలు, డ్రెస్సింగ్ టేబుళ్లను భుజాలపై మోసుకెళ్లి పక్కకు పెట్టారు. దీంతో అవి కాలిపోకుండా కాపాడారు. స్థానికులతో పాటు హైడ్రా, పోలీసులు సైతం సామగ్రి తరలించారు.

### వరుస ఘటనలు

హైదరాబాద్ నగరంలో ఇటీవల అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెలలో అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో మంటలు అంటుకున్నాయి. జనవరిలో నాంపల్లిలోని బచ్చాస్ ఫర్నిచర్ గోదాంలో ప్రమాదం జరిగి ఐదుగురు సజీవ దహనం అయ్యారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి షాపింగ్ మాల్‌లో మంటలు వ్యాపించాయి. వేసవి ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. అయితే చాలా వరకు ప్రమాదాలకు భవన యజమానుల నిర్లక్ష్యమే కారణం అవుతోంది.

### తనిఖీలు ఎక్కడ

బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం అనంతరం హైడ్రా, ఇతర శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని పలు దుకాణాలను సీజ్ చేశారు. అనంతరం నెల రోజుల్లో నిబంధనలు అమలు చేస్తామని దుకాణాదారులు, వ్యాపారులు చెప్పడంతో అధికారులు తనిఖీలకు నెల విరామం ఇచ్చారు. ఆ గడువు ముగిసినా మళ్లీ తనిఖీలు ప్రారంభించలేదు. పెద్ద పెద్ద భవనాల్లో మంటలు అంటుకుంటే భారీ ఎత్తున నష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తోనేనా..

బాచుపల్లిలో ఖాళీ స్థలంలో కొందరు ఫర్నిచర్ దుకాణాలు వేసుకొని ఏళ్లుగా ఉంటున్నారు. అయితే ఆ స్థలం ప్రైవేట్ వ్యక్తిది అయినట్లు సమాచారం. దీంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయమని ఆయన కొంత కాలంగా దుకాణాలు పెట్టుకున్న వారిని కోరుతున్నట్లు తెలిసింది. తాను వేరే వారికి స్థలాన్ని లీజుకు ఇచ్చానని, దుకాణాలు వేరే ప్రాంతంలో పెట్టుకోవాలని సూచించినట్లు సమాచారం. అయితే పలువురు దుకాణారులు ఖాళీ చేసి వెళ్లగా.. మరికొందరు మాత్రం అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయా.. లేక ఎవరైనా కావాలనే చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో మక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మక్క రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఆరేపల్లిలో సుమారు 350 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు హరీశ్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు కాంగ్రెస్ పాలనలో కష్టాలు తప్పడం లేదన్నారు.

## అలాంటి వాటికి దూరంగా ఉండడమే మేలు..



ఎవరైనా మన గురించి తప్పుగా అర్థం చేసుకుంటున్నారని తెలిసినప్పుడు బాధగా అనిపిస్తుందని హీరోయిన్ జాన్వీ కపూర్. కొన్నాళ్లుగా ఆమె సోదరుడు అర్జున్ కపూర్ సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్స్‌కు గురవుతున్న నేపథ్యంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో జాన్వీ ఈ అంశంపై మాట్లాడింది. అలాంటి వేధింపులను క్షమించాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సోషల్ మీడియా సంస్కృతి గురించి నేను అర్థం చేసుకున్నదల్లా ప్రతిఒక్కరూ తమ అభిప్రాయాలను పంచుకుంటూ వైరల్ అవ్వాలని కోరుకుంటారు. కాబట్టి వాళ్లు మీ గురించి కంటెంట్ సృష్టిస్తుంటే అందులో మీరు కేవలం బలిపశువు మాత్రమే. వారు మీ పేరు ఉపయోగించుకుని వ్యూస్‌లను పొందాలనుకుంటారు. నిజానికి ఆ వార్తలు చదివాక దానికి మీకు ఏ సంబంధం లేదని కూడా మీకు అర్థం అవుతుంది. ఇలాంటి నెగిటివిటికీ మిమ్మల్ని మీరు ఎంత దూరంగా ఉంచుకుంటే అంత మేలు' అని పంచుకుంది.

—అక్షరటుడే, సినిమా డెస్క్

## అగ్నిగుండంలో పడిపోయిన భక్తులు..



**అక్షరటుడే, నల్గొండ:** నల్గొండ జిల్లాలోని ఆమనగల్లు పార్వతీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అగ్ని గుండంలో నుంచి వెళ్తున్న భక్తులు అందులో పడిపోయారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లులో పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారు జామున అగ్ని గుండాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి పల్లకిని తీసుకొని అగ్నిగుండంలో నుంచి వెళ్తుండగా తొక్కిసలాట చోటు చేసుకుంది. ఒకేసారి భారీగా భక్తులు పరుగెత్తడంతో పలువురు అగ్ని గుండంలో పడిపోయారు. ఈ ఘటనలో పది మంది భక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించారు.

## పలమనేరు బైపాస్‌లో ఘోర ప్రమాదం.. ఐదుగురు దుర్మరణం



**అక్షరటుడే, ఏపీ:** చిత్తూరు జిల్లా పలమనేరు బైపాస్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మృతులు కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. వారు శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు బయలుదేరినట్లు తెలుస్తోంది. ప్రయాణం మధ్యలో పలమనేరు బైపాస్ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. కారు అధిక వేగంతో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో వాహనం పూర్తిగా దెబ్బతింది. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.